సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



జూ లవర్స్ డే

విశాఖ : జూ పార్కులో శనివారం నేషనల్ జూ లవర్స్ డే నిర్వహించారు. చిన్నారులకు జంతువుల జీవన విధానాన్ని వివరించారు.



శ్రీవారి దర్శనం కోసం..

విశాఖ: రుషికొండలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీవారి నామ సంకీర్తనలు ఆలపించారు.



కొలువుదీరనున్న గురువులు!

డీఎస్సీ–98 క్వాలిఫైడ్ అభ్యర్థులకు కొలువులు దక్కే తరుణం ఆసన్నమైంది. కొత్త గురువులు త్వరలోనే స్కూళ్లలో కొలువుదీరనున్నారు.


10లో

రంజాన్ వేళలు

అనకాపల్లి
ఇఫ్తార్ (ఆది) సహర్ (సోమ)
6-15 4-30
నర్సీపట్నం
6-18 4-29

శ్రీసాగు.. చెరకు దిగుబడి బాగు

- చెరకు కొత్త వంగడాలపై రైతుల ఆసక్తి
- అధిక దిగుబడి ఇచ్చే 'శ్రీ'సాగుకు మొగ్గు
- రాయితీపై 35 లక్షల ఒంటికన్ను ముచ్చులు అందించనున్న గోవాడ సుగర్స్



ఒంటికన్ను ముచ్చు తయారు చేసేందుకు సిద్ధం చేసిన విత్తనం



శ్రీ సాగు పద్ధతిలో నాటేందుకు సిద్ధంగా ఉంచిన ఒంటికన్ను ముచ్చు మొక్క

చోడవరం: భూ సారంలో చోటుచేసుకుంటున్న మార్పులు, వాతావరణ కాలుష్య కారణంగా చెరకు తోటల దిగుబడి తగ్గిపోతోంది. పాత రకం వంగడాలు నామమాత్రం దిగుబడి ఇస్తుండటంతో కొత్త రకాల వంగడాలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మరో పక్క సాధారణంగా వేసే తోటలు ఎక్కువగా ప్రకృతి వైపరీత్యాలకు నేల మట్టమవుతుండటంతో జిల్లా రైతులు ఇప్పుడు చెరకులో శ్రీసాగు విధానంపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో రైతులకు తన వంతు సాయం చేసేందుకు గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కొత్త వంగడాలకు ఒంటికన్ను విత్తనాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ ఫ్యాక్టరీ పరిధిలో సుమారు 30 వేల ఎకరాల్లో చెరకు సాగు జరుగుతోంది.

చెరకు సాగులో అధిక పెట్టుబడి విత్తనానిదే. దీన్ని తగ్గించే ప్రయత్నాల్లో రూపుదిద్దుకున్నదే శ్రీ (సుగర్‌కేన్ రెన్యూడ్ ఇంటెన్సిఫికేషన్) విధానం. చిత్తూరు జిల్లా ఉయ్యూరు వ్యవసాయ పరిశోధన స్థానం చెరకు సాగులో కొత్తగా ఈ

కొత్త సాగుపై అవగాహన

జిల్లాలో సాధారణ చెరకు విస్తీర్ణం ఏటా సుమారు 1.10 లక్షల ఎకరాలు. పారిశ్రామిక ప్రాంతాలు పెరగడం, వేసిన విత్తనమే రైతులు మరలా మరలా వేయడంతో భూమిలో సారం తగ్గి ఆశించిన మేర పంట దిగుబడి రావడం లేదు. దీంతో అనకాపల్లి, కొండెంపూడి వ్యవసాయ పరిశోధన కేంద్రాలు చెరకులో కొత్త వంగడాలు, సాగులో కొత్త విధానాలను తెచ్చి రైతులు ఆచరించే విధంగా ఇప్పటికే చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నారు.

ఒంటికన్ను ముచ్చుతో శ్రీ సాగు

గత కొంత కాలంగా ఒంటికన్ను ముచ్చుతో శ్రీసాగు విధానంలో కొందరు మాత్రమే చెరకు తోటల పెంపకం చేసేవారు. గత నాలుగేళ్లుగా ఈ విధానాన్ని మరింత విస్తృతం చేసేందుకు ఫ్యాక్టరీ కూడా రైతులకు అవగాహన సదస్సులు పెట్టింది. దీంతో ఈ విధానంలో సాగుకు ఎక్కువ మంది సుముఖత వ్యక్తం చేయడంతో 2023–24 క్రషింగ్ సీజన్‌కు 35 లక్షల ఒంటికన్ను ముచ్చులను ఫ్యాక్టరీ ద్వారా రైతులకు అందించేందుకు పలు ప్రాంతాల్లో నర్సరీలు పెంచి, సరఫరాకు సిద్ధం చేస్తున్నారు. పాత వంగడాల స్థానంలో కొత్త వంగడాలనే గోవాడ ఫ్యాక్టరీ ఈ ఏడాది ఒంటికన్ను ముచ్చు విత్తనంగా తయారు చేసి రైతులకు సరఫరా చేస్తోంది.

వర్షాభావాన్ని తట్టుకునేలా..

వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు శ్రీ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ విధానాన్ని చిత్తూరు పరిసర జిల్లాలవారు ఎక్కువగా ఆచరిస్తున్నప్పటికీ మన జిల్లాలో ఇప్పటి వరకు ఈ విధానంలో చెరకు సాగు అంతగా లేదు. అత్యధికంగా వర్షాధారం, రిజర్వాయర్ల పైనే ఆధారపడి ఇక్కడ చెరకుసాగు జరుగుతోంది. దీంతో తుపాన్లు, వర్షాభావ పరిస్థితులను తట్టుకుని, తక్కువ నీటితో తొందరగా ఎదిగే శ్రీ సాగు పద్ధతిలో చెరకు పెంపకానికి రైతులు మరింత మొగ్గుచూపుతున్నారు.

'శ్రీ' సాగు విధానాన్ని కనిపెట్టింది. దీంతో విత్తనం ఖర్చు సగానికిపైనే తగ్గింది. ఇందులో నీటి ఆదాతోపాటు అంతర పంటలకూ అవకాశం ఉంది. చీడ–పీడల తాకిడి తగ్గి, చెరకు దిగుబడి, పంచదార నాణ్యత పెరుగుతుంది.

పెట్టుబడి తగ్గించే శ్రీ సాగు

పాత పద్ధతిలో ఎకరాకు నాలుగు టన్నుల చెరకు విత్తనం అవసరమవుతుంది. సాలుకు–సాలుకు మధ్య రెండు లేక రెండున్నర అడుగుల దూరంలో విత్తనం నాటుతారు. శ్రీ సాగులో చెరకు కన్నులను మాత్రమే నాటుతారు. దీంతో ఎకరాకు 6500 మొక్కలు (కన్నులు) సరిపోతాయి. దీంతో చెరకు తోటల్లో అంతర పంటలు వేసుకొని అదనపు ఆదాయం పొందొచ్చు. శ్రీ చెరకు సాగులో కేవలం విత్తనాల్లోనే ఎకరాకు రూ.15 వేలు నుంచి రూ.25 వేలు వరకు ఆదా అవుతుంది. సాధారణ పంట ఎకరాకు 20 టన్నులు దిగుబడి వస్తే శ్రీ సాగులో ఎకరాకు 40 టన్నులకు పైగా దిగుబడి సాధించవచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

చెరకులో కొత్త రకం వంగడాలు

చెరకులో కొత్తగా 2009ఎ107, 87ఎ298, 2003వి46, 2006ఎ81, 2006ఎ252 రకాలు వేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. దీంతో ఈ వంగడాలతోనే ఒంటికన్ను ముచ్చు విత్తనాలను గోవాడ ఫ్యాక్టరీ తయారు చేస్తోంది.

> **ఈ ఏడాది 35 లక్షల విత్తనాలు సరఫరా**
>
> శ్రీ చెరకు సాగుపై రైతులను చైతన్య పరచడంతోపాటు కొత్త రకం వంగడాలతో ఒంటికన్నుముచ్చు విత్తనం తయారు చేస్తున్నాం. ఈ ఏడాది 35 లక్షల ఒంటికన్ను ముచ్చు విత్తనాన్ని సిద్ధం చేశాం. ఒక మొక్క తయారీకి రూ.1.70 ఖర్చవుతుండగా ఫ్యాక్టరీ 80పైసలు రాయితీ ఇస్తుంది. రైతుల విత్తనం ఖర్చు వారి చెరకు పేమెంట్స్ నుంచి మినహాయించుకుంటాం. ఒంటికన్ను ముచ్చు విత్తనం తయారీ యూనిట్లు మరిన్ని పెంచే యోచన చేస్తున్నాం.
>
> – సన్యాసినాయుడు, ఎమ్‌డీ, గోవాడ సుగర్స్

నక్కపల్లి ఆస్పత్రికి మరో ఇద్దరు డాక్టర్లు



డాక్టర్ ప్రియాంక



డాక్టర్ ఇషాక్ మహ్మద్

నక్కపల్లి: నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి మరో ఇద్దరు వైద్యులను ప్రభుత్వం నియమించింది. గైనకాలజిస్ట్ డాక్టర్ ఎస్.ప్రియాంక చోడవరం నుంచి వచ్చారు. కంటి వైద్యుడు డాక్టర్ ఇషాక్ మహ్మద్ విశాఖపట్నం నుంచి వచ్చారు. ఈ ఇద్దరు డాక్టర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. 30 పడకల స్థాయిలో ఉన్న ఈ ఆస్పత్రిని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం 50 పడకల స్థాయికి పెంచింది. రూ.3 కోట్లు విడుదల చేయడంతో 50 పడకలకు అవసరమైన అదనపు భవనాలు నిర్మించి సదుపాయాలు కల్పించారు. ఆర్థోపెడిక్ సర్జన్‌ను ఇటీవలే నియమించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో పూర్తి స్థాయిలో గైనిక్, ఆర్థోపెడిక్, పీడియాట్రీషియన్, జనరల్ మెడిసన్, కంటి వైద్యులు అందుబాటులో ఉన్నారు. రోగులకు అవసరమైన వైద్య సదుపాయాలు, ఇన్‌పేషెంట్లుగా ఉన్న వారికి భోజన సదుపాయం కల్పించడంతో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. నిత్యం 350 మంది రోగులకు పైగా ఓపీ సేవల కోసం ఆస్పత్రికి వస్తున్నారు. ఆధునిక వసతులతో కూడిన ఆపరేషన్ థియేటర్లు, అంబులెన్స్, ఆక్సిజన్ సదుపాయం, ఇన్‌పేషంట్ల కోసం వార్డులు, డిజిటల్ ఎక్స్‌రే ప్లాంటు, ఈసీజీ సదుపాయం కూడా అందుబాటులో ఉంది. నామమాత్రపు ఫీజు చెల్లిస్తే ఇన్‌పేషెంట్లకు ప్రత్యేక గదులు కేటాయించే సదుపాయం కూడా ఈ ఆస్పత్రిలో అందుబాటులో ఉంది.

సీహెచ్‌సీకి రూ.8.20 లక్షల వైద్య పరికరాల వితరణ

కోటవురట్ల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు హెచ్‌పీసీఎల్ కంపెనీ అత్యాధునిక పరికరాలను వితరణగా అందజేసింది. హెచ్‌పీసీఎల్ మేనేజర్ పల్లా వరప్రసాద్ ఈ వైద్య పరికరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మికి శనివారం అందజేశారు. హెచ్‌పీసీఎల్ మేనేజర్ వరప్రసాద్ మాట్లాడుతూ తమ కంపెనీ వాణిజ్యపరంగానే కాకుండా సేవా కార్యక్రమాలు కూడా విరివిగా చేపడుతోందన్నారు. ప్రతి సంవత్సరం ప్రజలకు ఉపయోగపడేలా విద్య, వైద్య రంగాలలో తోడ్పాటునందిస్తూ పరికరాలను అందిస్తున్నట్టు తెలిపారు. గతంలో కోటవురట్ల మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు, బెంచీలు, లైబ్రరీలు, మినరల్ వాటర్ ప్లాంట్లు, వాష్‌రూమ్స్ అందించినట్టు తెలిపారు. తాజాగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రూ.8.20 లక్షల విలువైన ఈసీజీ, సీటీజీ హైడ్రాలిక్ ఆపరేషన్ టేబుల్ వంటి వైద్య పరికరాలను అందించినట్టు తెలిపారు.



సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మికి వైద్య పరికరాల జాబితా అందజేస్తున్న హెచ్‌పీసీఎల్ మేనేజర్

పోలీస్ స్టేషన్ నుంచి గంజాయి నిందితుడి పరారీ



పరారైన సత్తిబాబు

సీతమ్మధార (విశాఖ): గంజాయి తరలింపు కేసులో పట్టుబడిన ఇద్దరు నిందితుల్లో ఓ వ్యక్తి స్టేషన్ నుంచి బేడీలతో పరారయ్యాడు. ఫోర్త్‌టౌన్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన పోలీసులను ఉలిక్కిపడేలా చేసింది. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు బృందాలుగా ఏర్పడి.. నగరంతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల్లో నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. లిక్విడ్ గంజాయి తరలిస్తున్నట్లు సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం రైల్వేస్టేషన్ దరిలో తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చిన్నపాచిల గ్రామానికి చెందిన పప్పు నూకరాజు, చోడవరం మండలం లక్ష్మీపురానికి చెందిన సియాదుల సత్తిబాబును పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 2 లీటర్ల లిక్విడ్ గంజాయి ప్యాకెట్లతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. శుక్రవారం రాత్రి వారు పోలీస్ కస్టడీలో ఉండగా.. ఏఎస్ఐతో పాటు మరో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు వారికి కాపలాగా ఉన్నారు. ఉదయం మరుగుదొడ్డికి వారిని తీసుకెళ్లే క్రమంలో తప్పించుకునేందుకు ప్రయత్నించారు. సత్తిబాబు బేడీలతోనే మహిళా కానిస్టేబుల్ జయలక్ష్మిని తోసేసి పరారయ్యాడు. నూకరాజు పరుగెత్తలేక పోలీసులకు దొరికిపోయాడు. కైలాసపురం డీఎల్‌బీ గ్రౌండ్ సమీపంలో బేడీలతో సత్తిబాబు స్థానికులకు కనిపించడంతో పట్టుకోవడానికి ప్రయత్నించగా.. అక్కడ నుంచి పరుగులు తీశాడు. ఈస్ట్ ఇన్‌చార్జి ఏసీపీ వివేకానంద ఘటనపై విచారణ చేపట్టారు.

న్యూస్‌రీల్

కొత్త ఎస్పీ కె.వి.మురళీకృష్ణ

ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా గౌతమి సాలి బదిలీ



మురళీకృష్ణ

సాక్షి, అనకాపల్లి: జిల్లా ఎస్పీగా కె.వి. మురళీకృష్ణ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం ఎస్ఐబీలో ఐఎస్ఓ(ఇంటర్‌స్టేట్ ఆపరేషన్స్)గా పని చేస్తున్నారు. ఇక్కడ ఎస్పీగా పనిచేస్తున్న 2017 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన గౌతమి సాలిని విశాఖపట్నం ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ఎస్పీ మురళీకృష్ణ నెల్లూరులో శిక్షణ పొందారు. రాజమండ్రి సీఐడీ డీఎస్పీగా, తిరుపతి డీఎస్పీగా, తిరుమల అడిషనల్ ఎస్పీగా, ఇంటెలిజెన్స్ ఎస్పీగా గతంలో విధులు నిర్వహించారు. మరో రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయన స్వగ్రామం పార్వతీపురం.

పోలీస్ కమిషనర్‌గా త్రివిక్రమ్ వర్మ



దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖ నూతన పోలీస్ కమిషనర్‌గా సి.ఎం. త్రివిక్రమ్ వర్మ నియమితులయ్యారు. ఇప్పటివరకు సీపీగా విధులు నిర్వర్తించిన సిహెచ్. శ్రీకాంత్ సీఐడీ ఐజీగా బదిలీ అయ్యారు. అలాగే డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా ఉన్న సుమిత్ సునీల్ గరుడ్‌ను ఎస్ఐబీ ఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో 2016 బ్యాచ్‌కు చెందిన ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీగా ఉన్న వాసన్ విద్యా సాగర్‌నాయుడును నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. 2005 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సి.ఎం.త్రివిక్రమ్ వర్మ సమర్థవంతమైన అధికారిగా పేరు సంపాదించారు. వైద్య విద్యను అభ్యసించినప్పటికీ సివిల్స్‌పై మక్కువతో ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా ఐజీగా విధులు నిర్వర్తిస్తున్న ఈయనకు విశాఖతో కూడా అనుబంధం ఉంది. 2015లో విశాఖ డీసీపీగా విధులు నిర్వర్తించారు. సీఐడీ డీఐజీగా, ప్రకాశం జిల్లా ఎస్పీ, విశాఖ డీసీపీ, ఏపీఎస్పీ 8వ బెటాలియన్ కమాండెంట్, తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ, రంపచోడవరం ఏఎస్పీ, నర్సీపట్నం ఓఎస్‌డీగా విధులు నిర్వర్తించారు.

'షిప్‌మంత్ర'తో ఇంటి నుంచే కార్గో సేవలు

విశాఖపట్నం: ఇంటి నుంచే కార్గో సేవలందించేందుకు ఆర్టీసీ తీసుకొచ్చిన 'షిప్‌మంత్ర'ను వినియోగించుకోవాలని మద్దిలపాలెం సిటీ డిపో మేనేజర్ అరుణకుమారి కోరారు. పార్సిల్ కౌంటర్‌కు రాకుండానే షిప్‌మంత్రలో బుక్ చేసుకుంటే.. ఇంటి వద్దకే వచ్చి పార్సిల్ పికప్ చేసుకుని డోర్ డెలివరీ చేస్తామన్నారు. 24 గంటల్లోనే పంపించడానికి ఫాస్ట్ సర్వీస్ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సదుపాయం విశాఖ నగరం నుంచి రాజమండ్రి, విజయవాడ, కాకినాడ, హైదరాబాద్, విజయనగరం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు ఉందన్నారు. తక్కువ ధరలతో ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు https://www.shipmantra. comను సంప్రదించవచ్చు.

సరస్వతి నిలయంలో 'విదేశీ' సాగు

- ఖాళీ సమయంలో వ్యవసాయం చేస్తున్న వియత్నాం విద్యార్థులు
- ఆకుకూరలు, ఔషధ మొక్కల పెంపకం

ఏయూక్యాంపస్: విభిన్న సంస్కృతి, సంప్రదాయాల సమాహారం ఆంధ్ర విశ్వ విద్యాలయం. విద్యనభ్యసించడానికి పలు దేశాల నుంచి విద్యార్థులు తరలిరావడంతో మినీ ప్రపంచమే ఇక్కడ కనిపిస్తుంది. విదేశీ విద్యార్థులు చదువుతో పాటు వ్యవసాయం చేస్తూ.. ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా వియత్నాం దేశానికి చెందిన విద్యార్థులు వివిధ రకాల ఆకుకూరలు, ఔషధ మొక్కలు పెంచుతూ.. హాస్టల్ పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆహ్లాదం, ఆరోగ్యం పంచే మొక్కల పెంపకాన్ని వీరంతా అలవాటుగా మార్చుకున్నారు.

ఏయూలో వియత్నాం దేశానికి చెందిన విద్యార్థులు పీజీ, పీహెచ్‌డీ కోర్సులు అభ్యసిస్తున్నారు. వీరంతా ఎంవీపీకాలనీలోని అంతర్జాతీయ విద్యార్థుల వసతిగృహంలో ఉంటున్నారు. ఆ దేశ విద్యార్థులు బౌద్ధ మతాన్ని ఆచరిస్తూ.. శాఖాహారులుగా జీవనం సాగిస్తున్నారు. ఉదయం 9 గంటల సమయంలో సూప్, సలాడ్, రైస్ వంటివి తీసుకుంటారు. మధ్యాహ్నం పండ్లు ఆహారంగా స్వీకరిస్తారు. సాయంత్రం 6–7 గంటల సమయంలో సాత్విక ఆహారాన్ని తీసుకోవడం వీరి దినచర్యలో భాగం. కొన్ని సమయాల్లో బ్రెడ్, ఫ్రైడ్ నూడిల్స్, పాలు, పన్నీర్ కూడా తీసుకుంటారు. తమ ఆహారంలో వినియోగించే వాము ఆకు, మిరప, ఉల్లి, బొప్పాయి, లెమన్ గ్రాస్‌తో పాటు వియత్నాంకు చెందిన జపనీస్ లేతూస్, బొంగాన్, కటుక్, తాయి బాసిల్, తియ్య దుంపలు(ఎర్ర దుంపలు) వంటివి ఇక్కడ పండిస్తున్నారు. ఎర్రదుంపల ఆకులు, లెమన్ గ్రాస్, జపనీస్ లేతూస్ ,బొంగాన్ ఆకులను సూప్‌ల తయారీకి వినియోగిస్తున్నారు. తమలపాకును పోలి ఉండే బొంగాన్ ఆకుల్లో ఆహారం ఉంచి ఉడికించడం వల్ల మంచి వాసన వస్తుందని విద్యార్థులు చెబుతున్నారు.



తోట పని చేస్తున్న వియత్నాం విద్యార్థులు

హాస్టల్..హరితమయం

వియత్నంలో సాగుచేసే పలు రకాల ఆహార, ఔషధ మొక్కలను తమతో పాటే తీసుకొస్తున్నారు. మొదట్లో కుండీల్లో పెంపకం చేపట్టారు. తర్వాత హాస్టల్ అధికారుల సహకారంతో వసతి గృహ ప్రాంగణంలో సాగు చేయడం ప్రారంభించారు. నీరు పోయడం, కలుపు తీయడం వీరి నిత్యకృత్యంలో భాగంగా మారిపోయింది. ప్రకృతికి దగ్గరగా ఉండటం, శాఖాహారం తీసుకోవడం, సేంద్రియ విధానంలో ఆకుకూరలు పండించడం తమకు ఆనందానిస్తోందని విద్యార్థులు చెబుతున్నారు. అలాగే తమ గదుల వద్ద కూడా మనీప్లాంట్, స్నేక్ ప్లాంట్‌తో పాటు వివిధ అలంకరణ మొక్కలను పెంచుతూ హరితమయంగా తీర్చిదిద్దారు.



హాస్టల్ గదుల వద్ద పెంచుతున్న మొక్కలు

సింహగిరికి పోటెత్తిన భక్తులు



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సింహాచలం: సింహగిరికి శనివారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. దర్శన క్యూలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రసాద విక్రయశాల, అన్నదాన భవనం వద్ద భక్తులు బారులుదీరారు. ద్విచక్ర వాహనాలు, కార్ల రాకతో ఎక్కడపడితే అక్కడ పలుమార్లు ట్రాఫిక్ సమస్య నెలకొంది.

గాజువాక వెళ్లి పింఛన్ పంపిణీ

బుచ్చెయ్యపేట: మంగళాపురం సర్పంచ్ కంటే పద్మరేఖ, గ్రామ వలంటీర్ జొన్నా నాగేశ్వరరావు ఔదార్యం చాటుకున్నారు. గ్రామానికి చెందిన వృద్ధురాలు పోలిమేర రమణమ్మ ఇటీవల అనారోగ్యానికి గురైంది. గాజువాకలో కుటుంబ సభ్యుల ఇంట్లో ఉండి వైద్య సేవలు పొందుతోంది. శనివారం గ్రామ సర్పంచ్ కంటే పద్మరేఖ సొంతఖర్చులతో గ్రామ వలంటీర్ నాగేశ్వరరావును తీసుకుని గాజువాక చేరుకున్నారు. ఇబ్బందుల్లో ఉన్న రమణమ్మకు పింఛన్ నగదు అందించారు. సర్పంచ్ పద్మరేఖ గతంలో గ్రామ వలంటీర్‌గా పనిచేశారు. మహిళలు రాజకీయాల్లోకి రావాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. సర్పంచ్‌గా గెలిచినా పాత రోజుల్ని మరచిపోని పద్మరేఖ.. గ్రామ వలంటీర్‌తో కలిసి శనివారం పెన్షన్ పంపిణీ చేశారు.



వృద్ధురాలు రమణమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ నాగేశ్వరరావు, సర్పంచ్ పద్మరేఖ

దార్శనికుడి పాలనలో బంగారు భవిష్యత్తు

- ప్రజలకు అండగా వైఎస్ జగన్ ప్రభుత్వం
- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ప్రజల కష్టాలు తెలుసుకొని వారి సంక్షేమానికి అన్ని విధాలుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ అన్నారు. అడ్డూరులో శనివారం జరిగిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ధర్మశ్రీ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల కష్టాలు తెలుసుకోవడంతోపాటు వారికి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వాలతో పోల్చి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు ఏ విధంగా మేలు జరుగుతుందో వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంటి దార్శనికుడు ముఖ్యమంత్రిగా ఉంటే ప్రభుత్వం ప్రజలకు మంచి భవిష్యత్తును అందించగలదన్నారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలు అడిగి ప్రజల అభిప్రాయాలను నమోదు చేశారు. ఇంటి యజమాని సెల్‌ఫోన్‌తో 8296082960 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. ఇంటి యజమాని సమ్మతితో స్వయంగా 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను అతికించారు. ఈ కార్యక్రమంలో పార్టీ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించిన పథకాలు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనపై వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అడ్డూరులో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఓ ఇంటి వద్ద స్టిక్కర్‌ను అతికిస్తున్న ధర్మశ్రీ

- ఇంకా అనకాపల్లి నియోజకవర్గంలో తుమ్మపాల పంచాయతీ సచివాలయం–3 పరిధిలో చిన బాబు కాలనీలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో పాల్గొన్నారు.
- నర్సీపట్నం టౌన్‌లో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.
- రాంబిల్లి మండలం పెదకలవలపల్లి గ్రామంలో ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు రాజు) ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు.

టీడీపీ నుంచి 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: మండలంలోని అడ్డూరుకు చెందిన 20 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో శనివారం చేరాయి. మాజీ ఉప సర్పంచ్ బోయిన చిన్నం నాయుడు, చుక్క శ్రీను, మామిడి లోవ, ఎస్.దేముడు బాబు, ఎలమంచిలి సోమేష్, చుక్కా బాబూజీ, చుక్కా వెంకట్రావు ఆధ్వర్యంలో అడ్డూరులో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి పార్టీ కండువాలు వేసి ఆయన సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో పనిచేసిన వారికి సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ మండలి చైర్మన్ నాగిరెడ్డి నారాయణ మూర్తి, వైఎస్సార్ సీపీ మండల ప్రతినిధి శరగడం చిమ్మినాయుడు, మాజీ ఉప సర్పంచ్ బూరా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.20 లక్షల వైద్య పరికరాలు అందించిన హెచ్‌పీసీఎల్



పరికరాలను వైద్యాధికారికి అందిస్తున్న సీఈవో వరప్రసాద్

మాకవరపాలెం: స్థానిక పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలను వైద్యాధికారి సీతారామలక్ష్మికి హెచ్‌పీసీఎల్ సీఈవో వరప్రసాద్ శనివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంతో రూ.1.20 లక్షలతో వీటిని సమకూర్చామన్నారు. వాటిలో ఈసీజీ మెషన్, ఆపరేషన్ థియేటర్‌లో వినియోగించే ఓటీ లైట్, మల్టీ పెరా మిషన్, సీటీజీ మెషిన్, రోగులను పరీక్షించేందుకు అవసరమైన టేబుల్ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్, ఎంపీహెచ్‌ఈవో గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పలకరింపుతో తన్నుకొచ్చిన దుఃఖం

- దివ్యాంగ బాలుడి దుస్థితికి చలించిపోయిన మంత్రి అమర్‌నాథ్
- వైద్యానికి ఎంత ఖర్చయినా ప్రభుత్వం భరిస్తుందని హామీ

అనకాపల్లి టౌన్: సగటు మనిషి సాధక బాధకాలు తెలియాలంటే చిన్న పలకరింపు చాలు.. అంత వరకు దాగివున్న బాధంతా గుండెల్లోంచి ఒక్కసారిగా తన్నుకొస్తుంది. ఆప్యాయంగా భుజం తడితే.. ఏనుగంత బలం వచ్చినట్టుగా సంబరపడిపోతాడు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గడప గడపకు కార్యక్రమంలో భాగంగా పర్యటించిన పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఒక కష్టజీవి హృదయ విదారక ఘటన తెలుసుకుని చలించిపోయారు. మంచానికే పరిమితమైన అతని కుమారుడి వైద్యానికి కావా



చేతన్ ప్రవీణ్ దుస్థితిని అడిగి తెలుసుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ల్సిన ఖర్చంతా భరిస్తానంటూ అభయమిచ్చారు. అనకాపల్లి మండలం తుమ్మపాలలో శనివారం గడప గడపకు కార్యక్రమంలో భాగంగా మంత్రి అమర్‌నాథ్ ఒక టిఫిన్ కొట్టు వద్ద ఆగాడు. సదరు టిఫిన్ కొట్టు యజమాని రామును ఆప్యాయంగా పలకరించారు. దాంతో అతడిలో ఎక్కడా లేని ఆనందం కొట్టొచ్చినట్టు కనిపించింది. ఈ క్రమంలో తన కుమారుడు చేతన్ ప్రవీణ్‌ను చూపించగా, మంత్రి కళ్లలో నీళ్లు చెమ్మగిల్లాయి. కాళ్లూ చేతులు చచ్చుబడిపోయి రెండేళ్ల నుంచి కూర్చున్న చోట నుంచి లేవలేడంటూ బాలుడి తండ్రి బావురుమన్నాడు. విశాఖ, హైదరాబాద్ తీసుకెళ్లగా, వైద్యులు పరీక్షించి శరీరంలో మల్టిపుల్‌జీన్స్ దెబ్బతిన్నాయని, పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని చెప్పారన్నారు. దాంతో అక్కడికక్కడే మంత్రి అమర్ వైద్యుడ్ని సంప్రదించి ఎంత ఖర్చవుతుందో వివరాలు తీసుకురావాలంటూ ఆదేశించారు. దీనికయ్యే ఖర్చంతా ప్రభుత్వం భరించేలా చేస్తానని, అవసరమైతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి నయం చేయించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దాంతో ఆ కుటుంబంలో చేతన్ భవిష్యత్‌పై ఆశలు చిగురించాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



శివాజీ కాళ్లకు కట్లు కడుతున్న ఏరియా ఆస్పత్రి సిబ్బంది

నర్సీపట్నం: మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి వద్ద శనివారం రాత్రి లారీ, బైక్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. టౌన్ సీఐ గణేష్ వివరాల ప్రకారం.. మాకవరపాలెం మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన జి.సత్తిబాబు, జి.శివాజీ తమ ద్విచక్ర వాహనంపై నర్సీపట్నం నుంచి మాకవరపాలెం వెళ్తుండగా ఈ ప్రమాదానికి గురయ్యారు. శివాజీకి రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. వీరిని 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలపై మహిళలకు శిక్షణ

మురళీనగర్: గల్ఫ్ దేశాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. కనీసం 5వ తరగతి అర్హత కలిగి చదవడం, రాయడం తెలిసి ఉన్న 18 నుంచి 45 ఏళ్ల వయసు మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రాష్ట్రంలోని కొందరు మహిళలు ఉపాధి కోసం నకిలీ ఏజెంట్ల మోసాల వలలో చిక్కుకుని సరైన అర్హతలు, పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లి అక్కడి చట్టాలు తెలియక మోసపోయి ఇబ్బందులు పడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, వైఎస్సార్ కడప జిల్లాల్లో హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ వంటి కోర్సుల్లో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఈ శిక్షణలో భాగంగా విదేశాల్లోని మతపరమైన సంస్కృతీ సంప్రదాయాలు, వారి జీవన విధానాలు, అలవాట్లు వంటి ముఖ్యమైన అంశాల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు ఆయా దేశాల చట్టాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం మహిళలకు గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. ఉపాధి పొందడానికి వెళ్లిన ఉద్యోగికి అక్కడ జీతభత్యాల చెల్లింపు, పనిచేసేటప్పుడు ఏమైనా ఇబ్బందులు తలెత్తిన సందర్భంలో భారత రాయబార కార్యాలయం బాధ్యత తీసుకుని తగిన సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. వివరాలకు అసోసియేట్ మేనేజర్ కార్తీక్ 94942 02677 లేదా https://kaushalmahotsav.nsdcdigital.org/Internationa/Candidate/ వెబ్‌సైట్‌లో పేర్లు మోదు చేసుకోవచ్చు.

గాయాలతోనే పరీక్ష రాసిన విద్యార్థులు



తీవ్రంగా గాయపడిన అయ్యప్ప

మాకవరపాలెం: గాయాలతోనే ఇద్దరు విద్యార్థులు పది పరీక్షలు రాశారు. మండలంలోని జి.కోడూరుకు చెందిన బొడ్డేటి అయ్యప్ప, మళ్ల గణేష్ శనివారం మండల కేంద్రంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షలు రాసేందుకు బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో జరిగిన ప్రమాదంలో అయ్యప్పకు తీవ్రగాయాలు కాగా, గణేష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వీరిద్దరూ ప్రథమ చికిత్స చేయించుకుని పరీక్షలు రాశారు. పరీక్ష పూర్తయిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లారు.

మూడు టేకు దుంగలు పట్టివేత

గొలుగొండ: కృష్ణాదేవిపేట రేంజ్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న మూడు టేకు దుంగలను అటవీశాఖ సిబ్బంది శనివారం పట్టుకున్నారు. మండలంలోని పల్లావూరులో రైతు తన పొలంలో చెట్లను అనుమతులు లేకుండా ఇంటికి తరలిస్తుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటికి అటవీ, రెవెన్యూ శాఖ అనుమతులు లేకపోవడంతో గొలుగొండ కలప డిపోకు తరలించారు.

ఎ. కొత్తపల్లిలో కోళ్ల ఫారం దగ్ధం



కోళ్ల ఫారం షెడ్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

రూ. 10 లక్షల మేర ఆస్తి నష్టం

దేవరాపల్లి: మండలంలోని ఎ. కొత్తపల్లిలో సంభవించిన అగ్ని ప్రమాదంలో కోళ్ల ఫారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన గోకాడ ప్రసాద్ తాటాకుల షెడ్‌లో శుక్రవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కోళ్ల ఫారం షెడ్ పూర్తిగా దగ్ధమైంది. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక దళం చేరుకున్నప్పటికి అప్పటికే షెడ్ పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనతో రూ. 10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు లబోదిబోమన్నారు. షెడ్‌తోపాటు కోళ్ల మేత కోసం బకెట్లు, ఇతరత్రా సామగ్రి కాలి బూడిదయ్యాయని వాపోయారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియరావడం లేదు.

డిప్యూటీ సీఎం బూడి పరామర్శ...

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన కోళ్ల ఫారాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు. ఈయన వెంట సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, కె.ఎం. పాలెం సర్పంచ్ గంధం రామకృష్ణ ఉన్నారు.

కొండుపాలెంలో రూ.1.50 లక్షల చోరీ

అనకాపల్లి టౌన్: మండలంలోని కొండుపాలెంలో గొల్లవిల్లి అప్పలరాజు ఇంట్లో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు రూ.1.50 లక్షలు చోరీ చేశారు. గ్రామీణ ఎస్‌ఐ సీహెచ్.నరసింగరావు వివరాల ప్రకారం.. అప్పలరాజు రోజు మాదిరిగానే పొలం పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరచి ఉంది. ఇటీవల సరుగుడు తోట అమ్మిన సొమ్ము అందులో లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. బాధితుడు కుమారుడు శివశంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.



బాధితుడు అప్పలరాజును విచారిస్తున్న ఎస్‌ఐ నరసింగరావు

శాస్త్రీయ సంగీతంపై వర్క్‌షాప్

సీతంపేట: విమల కృష్ణ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకురాలు మండపాక శారద ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం శాస్త్రీయ సంగీతంపై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభమైంది. ముఖ్య అతిథి సంగీత విద్వాంసుడు డాక్టర్ ద్వారం త్యాగరాజు సంగీత త్రిమూర్తుల చిత్రపటానికి జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రముఖ సంగీత విద్వాంసుడు ద్వారం భావనారాయణ స్వరపర్చిన శాస్త్రీయ సంగీత రచనలపై అవగాహన కల్పించారు. భావనారాయణ రచించిన పలు కీర్తనలు పాడి వినిపించి అందులోని సంగతులు వివరించారు. మండపాక శారద మాట్లాడుతూ ఆదివారం కూడా వర్క్‌షాప్ కొనసాగుతుందన్నారు.

క్లుప్తంగా

జోరుగా డ్రైనేజీల నిర్మాణం



కశింకోటలోని ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న మురుగు కాలువ నిర్మాణ పనులు

కశింకోట : కశింకోటలోని ఎస్సీ కాలనీలో మురికి కాలువల నిర్మాణం వేగవంతంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కేటాయించిన నిధులతో కాలువ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే కొంత మేర కాలువ నిర్మాణం చేశారు. మిగిలిన భాగంలో కూడా కాలువ పనులు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు శనివారం పనులను పరిశీలించారు.

నేత్రపర్వంగా కామాక్షిదేవి ఊంజల్ సేవ



కామాక్షిదేవి ఆలయంలో ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం కామాక్షిదేవి ఆలయంలో శుక్రవారం రాత్రి అమ్మవారి ఊంజల్‌సేవ నేత్రపర్వంగా జరిగింది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊయలలో ఉంచి ఊంజల్ సేవ నిర్వహించారు. నెలలో మొదటి శుక్రవారం అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించడం ఆనవాయితీ. ఈ సేవలో పాల్గొనే దంపతులు అమ్మవారి పూజా సామాగ్రితో పూజకు హాజరవుతారు. విశాఖ జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగులకొండ సూర్యాచారి దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు.

గడప గడపకు నేడు

అనకాపల్లిటౌన్ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలో తుమ్మపాల పంచాయతీ సచివాలయం-3 పరిధిలో మధురానగర్, విద్యుత్‌నగర్, వాటర్‌వర్క్స్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు శనివారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారని ఆయన తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

సొంతస్థలాల్లో ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం శ్రీకారం

- లబ్ధిదారుకు రూ.1.80 లక్షలు
- యూడీఏ పరిధిలో పేదలకు సువర్ణావకాశం
- మండలంలో 500లకు పైగా గృహాలు



సొంత స్థలంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇల్లు

తుమ్మపాల : పేదవాడి సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ప్రతి పేదవాడికి శాశ్వత గూడు కలిగించడమే లక్ష్యంగా పెట్టుకున్న లెక్క తప్పకుండా ఆలోచనలు చేస్తుంది. ఇప్పటికే జగనన్న కాలనీల ఏర్పాటు ద్వారా ఒక పక్క నూతన గ్రామాలనే ప్రభుత్వం తయారు చేస్తుంది. దీంతో పాటు సొంత స్థలం ఉండి సొంత స్థలంలోనే శాశ్వత ఇంటిని నిర్మించుకోవాలనే మరికొంత మంది కలను కూడా నిజం చేసే విధంగా ప్రభుత్వం మరో పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో అనేక మంది తమ ఇంటి స్థలాల్లో గృహాన్ని నిరించుకోలేక, వారు పడుతున్న పరిస్థితులను గమనించి ప్రభుత్వం సొంతింటి స్థలంలో ఇంటిని నిర్మించుకునే విధంగా ఇళ్ల మంజూరు దిశగా ప్రభుత్వం గృహనిర్మాణ శాఖకు మార్గదర్శకాలు జారీ చేసింది.

యూడీఏ పరిధి గ్రామాల ప్రజలకు మంచి రోజులు

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూడీఏ) పరిధి గ్రామాల్లో సొంతిళ్లు లేని పేదలకు శాశ్వత గృహాల మంజూరుతో గ్రామాల అభివృద్ధి దిశగా కూడా ప్రభుత్వం ప్రణాళికలు చేస్తుంది. ఖాళీగా ఉండే ఇంటి స్థలాల్లో గృహాల మంజూరు ద్వారా గ్రామాల అభివృద్ధికి దోహదం అవుతుంది. శరవేగంగా అభివృద్ధి జరుగుతున్న జిల్లాలో అనకాపల్లి పరిసర ప్రాంతాలు వాణిజ్య పరంగా దినదిన అభివృద్ధి జరుగుతున్నాయి. ప్రజలు జీవ స్థితి గతులు రోజురోజుకు మెరుగుపడుతున్నాయి. ఈ నేపథంలో జిల్లాలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఉన్న అనకాపల్లి, సబ్బవరం, కశింకోట, యలమంచిలి, పరవాడ, అచ్యుతాపురం, చోడవరం మండలాల్లో ప్రతి గ్రామంలో సొంత స్థలాలు కలిగి ఉన్న పేదలకు ఇళ్లను మంజూరు చేస్తున్నారు.

ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు

యూడీఏ పరిధిలో ఉన్న గ్రామాల్లో సొంత స్థలాల్లో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలను లబ్ధిదారుల ఖాతాకు గృహనిర్మాణ శాఖ నుంచి నేరుగా జమ చేస్తున్నారు. వివిధ దశల్లో గృహ నిర్మాణం వివరాలను సేకరించి దశలో వారీగా నగదు చెల్లింపులు చేస్తున్నారు. ఆసక్తి ఉన్న లబ్ధిదారులకు ఇంటి సామాగ్రిని కూడా అందిస్తున్నారు. వీటితో పాటు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు మరో రూ.30 వేలు అదనపు రుణంగా మంజూరు చేస్తున్నారు.

మండలంలో ఐదు వందలకు పైగా గృహాలు

అనకాపల్లి మండలం యూడీఏ పరిధిలో ఉన్నందున 32 గ్రామ పంచాయతీల పరిధిలో సొంత స్థలాల్లో ఇళ్లు కట్టుకునేందుకు పేదలు సముఖత చూపుతున్నారు. ఈ మేరకు గ్రామాల నుంచి దాదాపు ఐదు వందలకు పైగా దరఖాస్తులు సచివాలయాల ద్వారా గృహనిర్మాణ శాఖకు చేరాయి. ఇప్పటికే మండల వ్యాప్తంగా 180 గృహాలు మంజూరై సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తున్నారు. మరో 120 మందిని అర్హులుగా గుర్తించి నివేదిక తయారు చేయగా మంజూరుకు సిద్ధంగా ఉన్నాయి. సచివాలయాల్లో 250కి పైగా దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. స్థలాల వివరాలను పరిశీలించిన తరువాత గృహాలను మంజూరు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

లబ్ధిదారుల వివరాల సేకరణ

మండలంలో సొంతస్థలాలు కలిగి ఇంటిని కట్టుకోవాలనే వారిని గుర్తించి గృహాన్ని మంజూరు చేస్తున్నాం. ఈ మేరకు లబ్ధిదారుల వివరాలను సచివాలయాల ద్వారా సేకరిస్తున్నాం. ఇప్పటికే ఐదు వందలకు పైగా దరఖాస్తులు సేకరించాం. మండలంలో పలు గ్రామాల్లో ఇప్పటికే 180 గృహాలు మంజూరు చేశాం. నిర్మాణాలు కూడా జరుగుతున్నాయి. ఈ పథకంలో కూడా లబ్ధిదారుకు రూ.1.80 లక్షలు మంజూరు చేస్తున్నాం. గృహ నిర్మాణానికి సిమెంట్, ఇనుము, ఎలక్ట్రికల్, ప్లైవుడ్, ప్లంబింగ్, డోర్లు సహా లబ్ధిదారుకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయి.

–ఏఈ యుగంధర్, గృహ నిర్మాణ శాఖ, అనకాపల్లి మండలం

అక్కినేని అఖిల్, అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు



వెంకుపాలెం చిల్డ్రన్స్ ఆశ్రమంలో కేక్ కట్ చేస్తున్న అల్లు అర్జున్ అభిమానులు

అనకాపల్లిటౌన్ : అక్కినేని అభిమానులు యువహీరో అక్కినేని అఖిల్ జన్మదిన వేడుకలు శనివారం జరుపుకొన్నారు. పట్టణంలో సత్యనారాయణ థియేటర్ ఎదురుగా ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఉత్తరాంధ్ర కింగ్ నాగార్జున అభిమాన సంఘం అధ్యక్షుడు మళ్ల సురేంద్ర ప్రారంభించి పాదచారులకు మజ్జిగ అందజేశారు. జన్మదిన కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోల్డ్‌వాసు, అవతారం, శ్రీను పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ హోంలో..

సినీహీరో అల్లు అర్జున్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలో వెంకుపాలెం దయా చిన్నారుల ఆశ్రమంలో అభిమానులు చిన్నారుల మధ్య కేక్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో అభిమానులు గొంతిన శివకుమార్, గంగాధర్, సత్తిబాబు పాల్గొన్నారు.

18 మంది విద్యార్థుల గైర్హాజరు

కశింకోట : మండలంలో నిర్వహిస్తున్న టెన్త్ పరీక్షల్లో మూడో రోజు గైర్హాజరైన విద్యార్థులు పెరిగారు. 18 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో కె.చిట్టిబాబు తెలిపారు. మండలంలో 1190 మంది పరీక్షలు రాస్తుండగా మొదటి రోజు 9 మంది గైర్హాజరయ్యారన్నారు. తాజాగా 18 మంది గైర్హాజరయ్యారన్నారు.

ఎముకల సాంద్రతపై సదస్సు నేడు

అనకాపల్లిటౌన్ : వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జార్జిక్లబ్‌లో ఆదివారం ఉదయం 7 గంటలకు కీళ్ల వ్యాధి నిపుణులు ఆళ్ల వసంతకుమార్‌తో ఎముకల సాంద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ శనివారం పేర్కొన్నారు. క్లబ్ సభ్యులందరూ విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 4,305 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,900	4,200
మొదటి రకం	3,980	4,190
రెండో రకం	3,400	3,950
మూడో రకం	3,100	3,390

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 60 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-25 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్ 32 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 416 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 358 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

అనకాపల్లి సినిమాలు

మీటర్	రాజా
రంగమార్తాండ	సత్యనారాయణస్క్రీన్-1
డూంజియన్స్ అండ్ డ్రాగన్స్	సత్యనారాయణస్క్రీన్-2
రావణాసుర	షిర్డిసాయి
దసరా	పర్తిసాయి
భూతవైద్యుడు దిపోప్స్ ఎక్సర్సిస్ట్	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

పండగలా 'మా నమ్మకం నువ్వే జగన్'



కశింకోటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో కరపత్రాల అందజేత



గొల్లపేటలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రచారం



80వవార్డులో లబ్ధిదారులకు జగనన్న కరపత్రం అందిస్తున్న భాస్కరరావు, మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్ : మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం పట్టణంలో రెండో రోజైన శనివారం పండగలా జరిగింది. వైఎస్సార్‌సీపీ నేతలు ప్రతి ఇంటికి వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వ పాలనపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఫలాలు అందాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వారు పేర్కొన్నారు. అయా ప్రాంతాల్లో ఇంటి గోడలపై జగనన్న స్టిక్కర్లు అతికించారు. ఎన్నికల మేనిఫెస్టోలో అమలు చేసిన నవరత్న పథకాలు పూర్తి స్థాయిలో అమలు చేసిన తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మండలంలో గోపాలపురం గ్రామంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు ఇంటి గోడకు జగనన్న స్టిక్కర్లు అతికించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతి లబ్ధిదారుడిని కలిసి ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. 84వవార్డు వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి కోరుకొండ రాఘవ ఇంటింటికి వెళ్లి జగనన్న పాలనపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. 80వవార్డులో గవరపాలెం సతకంపట్టులో వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న లబ్ధిదారులను ప్రభుత్వ పాలనపై ఆరా తీశారు. 81వ వార్డులో పార్టీ యువజన నేత పీలా శ్యాం గణేష్ ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలన తీరును అడిగి తెలుసుకున్నారు.

కశింకోట : కశింకోటలో శనివారం రాత్రి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని వార్డుల వారీగా నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అంటించారు. బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై అభిప్రాయాలను సేకరించారు.

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో ఉన్న గొల్లపేట, దేవాంగుల వీధి ప్రాంతాల్లో శనివారం రాత్రి 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి, లగిశెట్టి గణేష్, సచివాలయ కన్వీనర్లు గుమ్మడి నారాయణరావు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



మెడికల్ హెల్త్ కార్డులను అందజేసిన వైద్యుడు నాయుడు

అనకాపల్లిటౌన్ : మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ జీవనశైలి మార్పు చేసుకోవాలని జనరల్ వైద్యుడు డి.డి.నాయుడు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లంమార్కెట్ యార్డులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో హెల్త్ కార్డులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో ఒత్తిడి జయించాలంటే నిత్యం వ్యాయామం చేయాలని కోరారు. వృద్ధులు, పిల్లలు వేసవి కాలంలో ఇంటినుంచి బయటకు వెళ్లే సమయంలో గొడుగులు తీసుకుని వెళ్లాలని, ఎక్కువగా శీతల పానీయాలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు యల్లపు సాంబశివ, కాండ్రేగుల వెంకట జగ్గారావు, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, కర్రి శివ, మద్దాల దిలీప్, శిలపరశెట్టి భాస్కర్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మునగపాక : తోటాడ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో తోటాడ ఓంకారం పీఠం వద్ద ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. చర్మ, సుగర్, గుండె, ఎముకలు, దంత, స్త్రీల వైద్య నిపుణులు సేవలందిస్తారన్నారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

మునగపాక : బూత్‌లెవెల్ అధికారులు ఓటరు నమోదుపై దృష్టి సారించాలని అసిస్టెంట్ కలెక్టర్ ఫి.ధాత్రిరెడ్డి కోరారు. శనివారం ఆమె మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో బూత్‌లెవెల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు నమోదులో భాగంగా చేర్పులు, మార్పులపై దృష్టి సారించాలన్నారు. అనంతరం స్థానికంగా రీ-సర్వే ఎంత మేర జరిగిందనే విషయమై సర్వేయర్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు



సంకీర్తన ఆలాపనలో విష్ణుమూర్తి

అనకాపల్లిటౌన్ : స్థానిక గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో వివేకానంద చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అన్నమయ్య, ఇతర భక్తి గీతాలు శనివారం భక్తులకు ఆకట్టుకున్నాయి. సంస్థ చైర్మన్ కాండ్రేగుల విష్ణుమూర్తి అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.

14 నుంచి దేశ వ్యాప్తంగా సభలు, పాదయాత్రలు

పాయకరావుపేట : ఈ నెల 14 నుంచి వచ్చే నెల 15 వరకు అంబేడ్కర్ జయంతి రోజు నుంచి దేశవ్యాప్తంగా సభలు, పాదయాత్రలు, నిర్వహించడం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ అన్నారు. పట్టణంలో గల పాండురంగ దేవస్థానంలో సీపీఐ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ హటావో దేశ బచావో అనే నినాదంతో జాతీయ నాయకులతో పాదయాత్రలు, నిరసన సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, పార్టీ నాయకులు రావు జగ్గారావు, సుబ్బలక్ష్మి, వి.అర్జునరావు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి రూ. 25 లక్షలు విడుదల

- వారం రోజుల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు



అవ్వకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం మండలంలో తుమ్మపాల పంచాయతీ సచివాలయం-3 పరిధిలో చిన్నబాబు కాలనీలో పలు ప్రాంతాల్లో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలు సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఇంకేమైనా సంక్షేమ పథకాలు కావాలా అని అడుగుతూ, గత ప్రభుత్వానికి, నేటి పాలనకు గల తేడా విషయంపై ఆరా తీస్తూ సంక్షేమ పుస్తకాలను లబ్ధిదారులకు అందజేస్తూ మంత్రి ముందుగు సాగారు. చాలామంది లబ్ధిదారులు ఒక్కోకుటుంబానికి సుమారుగా లక్ష నుంచి రూ.లక్షా 40 వేల వరకు లబ్ధిపొందుతున్నామని, మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని గెలుపించుకునే బాధ్యత మాపై ఉందని మంత్రికి చెప్పారు. కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని, కొత్త కాలనీల్లో రహదారులు, సీసీ రోడ్లు, తాగునీటి కుళాయిలు కావాలని పలువురు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఎంపీపీ నిధుల నుంచి రూ.15లక్షలు, ఆర్ అండ్ బీ నిధుల నుంచి రూ.10 లక్షలతో డ్రైనేజీ పనులు త్వరలో చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వారంరోజుల్లో ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు వేయడం జరుగుతుందన్నారు. ప్రజాహితమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకువచ్చే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఎల్లయ్య కాలువలో పూడికతీత పనులు త్వరితగతిన చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వశాఖ అధికారులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గుడి బాగుంటేనే గ్రామం కళకళ



కొండకర్ల రామాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ గ్రామ కమిటీ సమావేశం

అచ్యుతాపురం(అనకాపల్లి): ప్రతి గ్రామంలో దేవాలయాలు శక్తి కేంద్రాలుగా పని చేస్తాయని సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి రమణ అన్నారు. మండలంలోని కొండకర్ల రామాలయంలో శనివారం గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి.వి రమణ మాట్లాడుతూ దేవాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ చేసేటప్పుడు నవ ధాన్యాలతో, పంచ లోహాలతో, పంచామృతాలతో, వేద మంత్రాలతో ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుందని తెలిపారు. దేవాలయాల కేంద్రంగా పూజలు జరుగుతున్నప్పుడు ఆ గ్రామానికి దేవాలయం నుంచి శక్తి ప్రసరణ జరుగుతుందని తెలిపారు. వారం వారం దేవాలయాల్లో భజనలు, నెల నెలా సామూహిక హారతి నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. గుడి కళకళలాడుతుంటే గ్రామం కళకళలాడుతుందని తెలిపారు. కొల్లి అప్పారావు,గుడివాడ రమణ,కట్టమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్



నెహ్రూచౌక్‌లో ధర్నా చేస్తున్న ఉద్యోగులు

అనకాపల్లిటౌన్: ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు ప్రభుత్వ ఉద్యోగులు శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. అంతకుముందు ర్యాలీగా నెహ్రూచౌక్ కూడలికి చేరుకొని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.ఎస్.వి.ఎస్.నాయుడు మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. పెండింగ్ ఉన్న కొత్త డీఏలు విడుదల చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నినదించారు. నూతన జిల్లా కేంద్రాల్లో 16 శాతం హెచ్ఆర్ఏ మంజూరు చేయాలని, ప్రతినెలా 1వ తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించాలని, 11వ పీఆర్‌సీ పేస్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు యలమంచిలి శ్రీరామ్మూర్తి, కామారెడ్డి దేముడు, జి.వైకుంఠరావు, టి.వెంకటరమణ, దిలీప్, ఏబీహెచ్.శాస్త్రి, జయశ్రీ, సూర్యకళ పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మిషన్ వాత్సల్య దరఖాస్తున్న అందజేస్తున్న మందపాటి సునీత

అనకాపల్లిటౌన్ : తల్లిదండ్రులు లేని అనాథ పిలలకు ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. స్థానిక శ్రీరామ్‌నగర్ మరిడిమాంబ అమ్మవారి ఆలయంలో పథకందరఖాస్తు ఫారాలను శనివారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పథకంలో ఎంపికైన పిల్లలకు ప్రతి నెలా రూ. 4వేలు అందజేస్తున్నట్టు ఆమె చెప్పారు. తల్లిదండ్రులు లేని పిల్లల ధ్రువీకరణపత్రాలను దగ్గరలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ నేతలు వలకా సత్యనారాయణ, మూనూరు శ్రీనివాసరావు, ఉగ్గిన శ్రీను, రమేష్ గుప్తా పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్



పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

అనకాపల్లిటౌన్ : ఈస్టర్ పండగను పురస్కరించుకొని రెవసన్నీజేమ్స్ ఆధ్వర్యంలో సోమవారం 'రన్ ఫర్ జీసస్' ర్యాలీ జరిగింది. సుంకరమెట్ట కూడలి నుంచి నెహ్రూచౌక్ కూడలి వరకు ర్యాలీ సాగింది. ఈ ర్యాలీని గుడ్ షెపర్డ్ స్కూల్ కరస్పాండెంట్ పాల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, క్రైస్తవ పెద్దలు రెవ వినోద్ అబ్రహ్మాం, రెవ బెనర్జీ, రాజబాబు, భూషణ్‌బాబు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, కశింకోట సర్పంచ్ జయ రజిని పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ..ఇద్దరికి గాయాలు

కశింకోట : మండలంలోని బయ్యవరం వద్ద ఆటో ప్రమాదానికి సంబధించి కేసు శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి తెలిపారు. విశాఖపట్నంలోని అల్లిపురానికి చెందిన షేక్ మౌలావల్లి, కుమార్తె బషీర్ ఉన్నిసా యలమంచిలి మండలం రేగుపాలెం వద్ద బంధువుల ఫంక్షన్‌కి వెళ్లి తిరిగి ఈ నెల 6న ఆటోలో ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో బయ్యవరం వద్ద వెనుక నుంచి గుర్తు తెలియని లారీ ఢీకొని వెళ్లిపోయింది. దీంతో ఆటో బోల్తా పడడంతో వారిద్దరు గాయపడ్డారు. వారిని ఆస్పత్రిలో చేర్పారు. ఈమేరకు కుమారుడు షేక్ గౌస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.